"పూల్ మల్లెపూల్ !" అని వలీ సాహెబు వీధి మొగదల కేక వెయ్యటంతోనే వీధి అంతా పంచలిస్తుంది. ఆ కేకతోటే గాలి మల్లెలవాసన మోసుకొస్తుంది. ఆడుకుంటున్న ఆడపిల్లలు ఆట మాని పూల బుట్ట దగ్గరకు పరుగెత్తుకొస్తారు. దొడ్లో పని చేసుకుంటున్న ముత్తయిదువలు పని వొదిలేసి వాకిళ్ళలో కొచ్చేస్తారు.

సాయంవేళ మల్లెలెంత చల్లగా ఉంటాయో, వలీసాహెబు మాటలు అంత కంటె హాయిగా ఉంటాయి. బుట్ట మీదకి మూగిన పిల్లల్ని ఆపుతూ 'బుల్లెమ్మా ఈ పరికిణీ బాగుందే! సీతాలు చెవులు కుట్టించుకుందే! రత్తమ్మ కొత్త రవిక తొడిగిందే..." పిల్లల్ని పలకరించి, చెక్కిళ్ళు నిమిరి ప్రతి ఇంటి ముందుకు వచ్చేవాడు. "సుబ్బమ్మగారూ! పాపకి రేపు పూలజడ వేస్తారా!ఎక్కువ పూలట్టుకొస్తాను" అనేవాడు. వెంక మ్మ గారు వంద మల్లెమొగ్గలే కొంటే "బావుందండోయ్! ఇంకో వంద తీసుకోండి. చిన్నమ్మాయిగారికి — లేకపోతే ఆవిడ నన్ను తిడు తుంది" అంటూ ఇంకో వంద లెక్కపెట్టేవాడు.

అలా ఇంటింటికి పువ్వు లిచ్చుకుంటూ అందర్నీ

## మల్లెలవాన

పలకరిస్తూ ముందుకు సాగేవాడు. పండు ముత్తయిదువలు, మధ్య వయస్సువాళ్ళు, అందగత్తెలు, కొత్త కోడళ్ళు, కన్నె పిల్లలు విచ్చిన కళ్ళతో మల్లెలు చూసుకుంటూ జడల్లో తురుముకోగా వాళ్ళ ముఖాల్లో వెలిగిన దీపాలు, ఆ కొత్త వెలుగుచూసి సంబరపడిపోయేవాడు వలీ సాహెబు.

వీధిలో ఆఖరి ఇల్లు సీతప్పది. సీతప్ప మల్లెపూల కేకకే ఉలిక్కిపడుతుంది. పువ్వులంటే ఆమెకు పంచప్రాణాలు. కిందటేడే పెళ్ళయింది. నుదుట ఇంత పెద్దబొట్టు. మిలమిల్లాడే కళ్ళు. జడలో మల్లె పూలు పెట్టుకుంటూ వొళ్ళంతా పులకించిపోయే టంత పువ్వులాంటి మనసు సీతప్పది. వలీ సాహెబుకి సీతప్పని చూస్తే సొంత అప్పని చూసినట్లుంటుంది. "అప్పా, రెండు మూరలిస్తాను."

"వద్దు ఓ మూర చాలు" అంది సీతప్ప.

వలీ సాహెబు "డబ్బులు అయ్యకాడ తీసు కొంటాలే తీసుకో అప్పా" అంటూ రెండు మూరలు దండ, కాసివి విడి పూలు కూడా ఇస్తూ 'వచ్చే ఏదు పూల జడేసుకుని సూడిదలు చేసుకోవాలప్పా" అంటేసీతప్ప సిగ్గు పడి విడిపూలు వాసన చూసి దండ జడలో తురుముకుని లోపలికెళ్ళిపోయింది. సీతప్ప నల్లటి పొడవాటి జడలో మల్లెదండ చంద్ర వంకలా మెరిసింది. తృప్తిగా ఇంటి ముఖం పట్టిన వలీసాహెబు అనుకున్నాడు. "ఆడ పుటక్కి బొట్టూ, పూలే, సూరీడూ, సెంద్రుడు,"

గుడిసెలోకి రాగానే 'వచ్చావా సర్కార్!' అంది ఫాతిమా. ఫాతిమా భర్తని 'సర్కార్!' అంటుంది. వలీ సాహెబు భార్యని 'బీగం' అని ఆప్యాయంగా పిలుస్తాడు. పదేళ్ళనించి కాపురం చేస్తున్నా వాళ్ళింకా పడుచు జంటే! ఒకే శ్వాస! ఒకే ప్రాణం. భార్య కోసం మిగిల్చిన పూలు ఫాతిమా దోసిట్లో పోశాడు వలీ. క్షణాల్లో దండ గుచ్చుకుని తల్లో తురుముకుని భర్త కెదురుగా వచ్చి కూర్చుంది. పూలు పెట్టుకున్న భార్య ఎదురుగా కూర్చుంటే వలీకి అన్నం, నీళ్ళు అక్కర్లేదు. అలాగే వెన్నెల్లో కూర్చున్నారిద్దరూ. వెన్నెలకి మల్లెలు విచ్చుకుంటే, ఫాతిమా చెయ్యి తన చేతిలోకి తీసుకుని చంద్రుణ్ణి చుక్కల్ని చూస్తూ పూల పల్లకిలో వూరేగుతున్న ఆనందం అనుభవిం చాడు వలీసాహెబు.




మల్లెపూల సీజను అయిపోతే మరి ఆ వూళ్ళో ఉండడు అతను. ఇంకొక వూరు కూలికి వెళ్ళి పోతాడు. మళ్ళీ వసంతవేళ తిరిగి వస్తాడు.

సంవత్సరం తిరిగింది.

"పూల్ ! మల్లెపూల్ " మళ్ళీ వలీ సాహెబ్ కేక. మళ్ళీ కేరింతలు కొట్టే పిల్లలు! ముత్తయిదువలు! కన్నెపిల్లలు! కొత్త కోడళ్ళు! మల్లెపూల కళ్ళు! కొప్పులు! చెక్కిళ్ళ వెలుగు! కుంకుమ కాంతి! మల్లె గాలి! కలకల సువాసన.

వీధి చివరికొచ్చాడు వలీసాహెబు. సీతప్ప వాకిట్లో ఎదురుచూస్తూ నుంచోలేదు. "సీతప్ప కడుపు పండి వుంటుంది. సూడిదలకి పూలజడకి పూలివ్వాలి" అనుకున్నాడు. "పూల్! మల్లెపూల్!" కేకేశాడు. తలుపు తెరుచుకోలేదు. వలీ ఆశ్చర్య పోయాడు. మెట్లెక్కి వెళ్ళి తలుపు కొట్టి "మల్లె పూల్" అన్నాడు. సమాధానం లోపలినుంచి వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు ధ్వని వినిపించింది.

పక్కింటి పార్వతమ్మ చెప్పింది. "నువ్వెళ్ళిపో బాబూ! దానికి పూలెట్టుకొనే యోగ్యత లేదు. దేవుడు పసుపు కుంకుమ తుడిచేశాడు. వొట్టి మనిషి కూడా కాదు ఎట్టా బతుకుతుందో"

వలీసాహెబు కుప్పలా కూలిపోయాడు. కళ్ళు బైర్లు కమ్మాయి. కాళ్లీడ్చుకుంటూ నడుస్తూ "సీతప్పకి బొట్టు లేదా! మల్లెపూలెట్టుకోలేదా!" అనుకుంటూ గుడిసెకొచ్చాడు.

## అమరావతి కథలు
సత్యం శంకరమంచి

అప్పటికే స్నానం చేసిన ఫాతిమా "సర్కార్! నా పూలేవీ" అనంగానే రెండు దోసెళ్ళ పూలు భార్య చేతిలో మౌనంగా పోశాడు.

వెన్నెట్లో ఇద్దరూ.

ఉన్నట్టుండి వలీ అన్నాడు "నువ్వు బొట్టెట్టు కోవే."

"మన ఆచారం కాదుగా సర్కార్."

"ఫర్వాలేదు పెట్టుకో."

పక్కింటి కెళ్ళి కుంకం తెచ్చి నుదుట పెట్టు కుంది. వెన్నెట్లో మెరుస్తున్న ఆ బొట్టు చూస్తూ. "నా బీగానికి కూడా పూలు పెట్టుకునే రాత పోతేనో..." అనుకున్నాడు వలీ. ఎవరో ఛళ్ళున చరిచినట్టయింది. గుండె జారిపోయింది. కళ్ళు ధార లవుతున్నాయి. తనకి పూలు ప్రాణం. ఆడదానికి.

పూలేకళ్ళు, అది లేకుండా నా బీగం...

ఫాతిమాని దగ్గరకు తీసుకున్నాడు. కౌగలించు కున్నాడు. ఆ శరీరం, ఆ వాసన, ఆ పూలు అవి అతని గుండె చప్పుళ్ళు. ఫాతిమాని దగ్గరికి హత్తుకున్నాడు. దగ్గరగా ... మరింత దగ్గరగా ... ఆ కౌగిలింత విడిపో కూడదన్నట్టు —వలీ సాహెబు మరి లేవలేదు!

ఆ మర్నాడు ఆ వూరి ముత్తయిదువలకు పిలిచి పూలిచ్చినవాళ్ళు లేరు. ఫాతిమా ముఖాన చెదిరిన రక్తకుంకుమ!

జడనిండా వాడి వత్తలై రాలిన మల్లెలు!

